క్లుప్తంగా

'బజరంగ్' వైద్య శిబిరానికి స్వాత్మానందేంద్ర సరస్వతి రాక



స్వాత్మానందేంద్ర సరస్వతిని ఆహ్వానిస్తున్న అంబటి

పెదకాకాని: పొన్నూరు పట్టణంలో ఫిబ్రవరి మూడోవారంలో జరగనున్న బజరంగ్ జగన్నామ సంక్షేమ సంగమ వైద్య శిబిరానికి ముఖ్యఅతిథిగా విశాఖ శారదాపీఠం ఉత్తరాధికారి శ్రీ స్వాత్మానందేంద్ర సరస్వతీ మహాస్వామి విచ్చేయనున్నట్లు బజరంగ్ ఫౌండేషన్ అధినేత అంబటి మురళీకృష్ణ సోమవారం తెలిపారు. విజయవాడలో స్వామిని కలిసి బజరంగ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న వైద్య సేవా కార్యక్రమాలను తెలియజేయగా అభినందించారని తెలిపారు.

కాకుమాను తహసీల్దార్‌గా పార్వతి



కాకుమాను: కాకుమాను తహసీల్దార్‌గా పి.పార్వతి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆమె కాకుమాను తహసీల్దార్‌గా ఇక్కడకు వచ్చారు. గతంలో ఇక్కడ పనిచేసిన జె.ప్రసాదరావు ప్రకాశం జిల్లాకు బదిలీ అయ్యారు. గతంలో పార్వతి ప్రకాశం జిల్లా చినగంజాం తహసీల్దార్‌గా పనిచేస్తూ కాకుమాను మండలానికి వచ్చారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించే విధంగా తన వంతు కృషి చేస్తానని మండలంలోని అన్ని పార్టీల నాయకులు, ప్రజా ప్రతినిధులు సహకరించాలని ఆమె కోరారు. ఈసందర్భంగా నూతనంగా తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన పార్వతికి కార్యాలయ సిబ్బంది పూలమాలలు, శాలువాలతో ఘనంగా స్వాగతం పలికారు.

రక్షణసైన్యం ప్రార్థన మందిర వార్షికోత్సవం



పెదకాకాని: నంబూరు రక్షణసైన్య ప్రార్థన మందిరంలో సోమవారం 7వ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మండలంలోని నంబూరు అంబేడ్కర్‌నగర్‌లోని రక్షణ సైన్య ప్రార్థన మందిరం వార్షికోత్సవం పురస్కరించుకుని చర్చిని శోభాయమానంగా అలంకరించారు. సంఘకాపరులు లెఫ్టినెంట్ జి.మనోహర్, లెఫ్టినెంట్ జి.అనితలు ప్రత్యేక ప్రార్థనలు చేశారు. చర్చిలో జరిగిన ప్రత్యేక ప్రార్థనలకు అధికసంఖ్యలో భక్తులు తరలివచ్చారు. పొన్నూరు శాసనసభ్యుడు కిలారి వెంకటరోశయ్య సూచనల మేరకు నాల్గవవార్డు సభ్యుడు తియ్యగూర కిరణ్‌కుమార్‌రెడ్డి సంఘ పెద్దలకు రూ.50 వేలు అందజేశారు. ఈ వేడుకల్లో వైఎస్సార్ సీపీ నాయకులు చాగంటి మురళీమోహన్‌రెడ్డి, పెదకాకాని పీఏసీఎస్ చైర్‌పర్సన్ కోటిరెడ్డి, ఎంఎస్‌ఎంఈ డైరెక్టర్ భీమవరపు విజయలక్ష్మి, ఏపీ రెడ్డి కార్పొరేషన్ డైరెక్టర్ జొన్నల అవినాష్‌రెడ్డి, జొన్నల కరుణాకరరెడ్డి, దాసరి ఆనంద్‌బాబు, జెట్టి అనిల్‌కుమార్, వసంతకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఫిజియోథెరపీతో పలు ప్రయోజనాలు

కాకుమాను: ప్రత్యేక అవసరాలు గల చిన్నారులతో తల్లిదండ్రులు ప్రతి రోజు చిన్న చిన్న వ్యాయామాలు చేయించాలని హైదరాబాద్ నిమ్స్ ఆస్పత్రి ఫిజియోథెరపిస్టు రమేష్ అన్నారు. స్థానిక భవిత కేంద్రంలో సోమవారం ప్రత్యేక అవసరాలు గల చిన్నారులకు నిమ్స్ ఆధ్వర్యంలో ప్రత్యేక ఫిజియోథెరపీ నిర్వహించారు. ఈసందర్భంగా రమేష్ మాట్లాడుతూ వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో బాధపడుతున్న చిన్నారులచే తల్లిదండ్రులు ప్రతి రోజు ఒక గంట సమయం చిన్న చిన్న వ్యాయామాలు చేయించాలని ఆయన సూచించారు. ఆరోగ్య సమస్యలు, అధిక నొప్పులతో బాధపడుతున్న చిన్నారులకు ఎలాంటి మందులు వాడకుండా వ్యాయామం చేయించాలని, పెయిన్ కిల్లర్స్ వాడడం వలన ఇతర ఆరోగ్య సమస్యలు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. అవయవ లోపాన్ని గుర్తించి వారిచే వాటికి సంబంధించిన వ్యాయామాలు చేయించడం వలన సుమారు రెండు నెలల్లో వారిలో 30 శాతం ఫలితాన్ని గమనించవచ్చునని ఆయన తెలిపారు. ఈసందర్భంగా చిన్నారులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. ఎంఈఓలు కేఎఫ్ కెనడీ, విజయ్ భాస్కర్, ఫిజియోథెరపిస్ట్ నవీన్, ఐఈఆర్టీ టీచర్ దయమ్మ పాల్గొన్నారు.

అన్న మాట ప్రకారం ఆసరా

నాడు.. ● డ్వాక్రా రుణాలన్నింటినీ అధికారంలోనికి రాగానే మేమే మాఫీ చేస్తాం. మీరెవ్వరూ రూపాయి కూడా చెల్లించాల్సిన పనిలేదని చంద్రబాబు చెప్పిన మాటలు మహిళలు నమ్మారు. నిజంగానే చంద్రన్న ఉద్ధరిస్తాడని నెలనెలా సక్రమంగా చెల్లించుకుంటున్న రుణాలను కూడా నిలిపివేసుకున్నారు. తీరా అధికారంలోకి వచ్చిన తరువాత బాబు తన అసలు నైజాన్ని బయటపెట్టి రుణ మాఫీకి మంగళం పాడేశారు. రుణమాఫీ సంగతి దేవుడికెరుక.. నెలసరి వాయిదాలు కట్టకపోవడంతో దాదాపుగా సగం గ్రూపులు, వందల మంది మహిళలు డిఫాల్టర్ల జాబితాల్లోకి వెళ్లిపోయారు. బ్యాంకరు రుణాలివ్వాలంటేనే భయపడాల్సిన పరిస్థితి వచ్చింది.

నేడు.. ● డ్వాక్రా రుణ మాఫీ చేస్తాం. అక్కచెల్లెమ్మలు తీసుకున్న డ్వాక్రా రుణాలను నాలుగు విడతలుగా వారి చేతికిస్తాం. అని వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్ర సాక్షిగా చెప్పిన మాటలు అక్షర సత్యాలయ్యాయి. ఇచ్చిన మాటకు కట్టుబడి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి త్రికరణశుద్ధితో వైఎస్సార్ ఆసరా పథకాన్ని అమలు చేస్తున్నారు. ఇప్పటికే మూడు విడతల్లో డ్వాక్రా మహిళలకు ఆర్థిక సాయాన్ని అందించిన సీఎం వైఎస్ జగన్ సర్కారు ఇప్పుడు నాల్గవ విడతను కూడా అందిస్తుంది. ఫలితంగా గ్రూపుల రుణ సామర్థ్యం, మహిళల పొదుపు సామర్థ్యం పెరిగి, బ్యాంకర్లు రుణాలిచ్చేందుకు ముందుకొస్తున్నారు.

- నాడు బ్యాంకుల్లో డిఫాల్టర్లుగా.. నేడు అవే బ్యాంకుల్లో ఆర్థిక క్రమశిక్షణకు మారుపేరుగా..
- నియోజకవర్గంలో 42,054 మంది డ్వాక్రా మహిళలకు రూ.140 కోట్ల మేర డ్వాక్రా రుణమాఫీ
- రేపు ప్రత్తిపాడు మండలంలో 'వైఎస్సార్ ఆసరా' సంబరాలు



డ్వాక్రా మహిళలు (ఫైల్)

ప్రత్తిపాడు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అక్కచెల్లెమ్మల రుణం తీర్చుకుంటుంది. పాదయాత్రలో ఇచ్చిన హామీలను, అధికారంలోనికి వచ్చిన క్షణం నుంచే డ్వాక్రా మహిళలను రుణ విముక్తి చేసేందుకు అడుగులు వేసింది. మహిళలు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు కావలసిన అన్ని చర్యలనూ తీసుకుంటుంది. అందులో భాగంగానే 'వైఎస్సార్ ఆసరా' పేరుతో డ్వాక్రా రుణమాఫీని కూడా ఎలాంటి ఆటంకాలు లేకుండా అమలు చేస్తోంది.

రూ.140 కోట్ల మేర లబ్ధి..

నియోజకవర్గవ్యాప్తంగా 4,235 గ్రూపులు పథకానికి అర్హత సాధించగా, 42,054 మంది డ్వాక్రా అక్కచెల్లెమ్మలు రూ.140.91 కోట్ల మేర లబ్ధి పొందుతున్నారు. ఇప్పటివరకు మూడు విడతల్లో 42,054 మంది మహిళలకు రూ.105.67 కోట్లు చెల్లించగా, నాల్గవ విడత వైఎస్సార్ ఆసరా కింద రూ.35.22 కోట్లు చెల్లించారు. వైఎస్సార్ ఆసరా నాల్గవ విడత సంబరాలు రేపు ప్రత్తిపాడు మండలంలో జరగనున్నాయి. వైఎస్సార్ క్రాంతి పథం ఆధ్వర్యంలో జరగనున్న సంబరాలను ఘనంగా నిర్వహించేందుకు ఇప్పటికే ఆశాఖ అధికారులు పూర్తి చేశారు.

మండలాల వారీగా ఆసరా లబ్ధిదారుల వివరాలు..

మండలం	గ్రూపులు	సభ్యులు	రూ. కోట్లు
ప్రత్తిపాడు	1003	10020	35.89
గుంటూరురూరల్	648	6493	18.40
కాకుమాను	868	8680	30.22
పెదనందిపాడు	720	6826	20.54
వట్టిచెరుకూరు	996	10035	35.86
మొత్తం	4235	42054	140.91

మహిళల ఆర్థిక స్వావలంబనే ప్రభుత్వ సంకల్పం



మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ సంకల్పం. ప్రభుత్వం అందిస్తున్న ఈ నగదుపై ఎలాంటి ఆంక్షలు లేవు. ఎలాంటి అవసరాలకైనా ఆసరా నగదును వినియోగించుకోవచ్చు. మహిళలు స్వయం ఉపాధి యూనిట్లు నెలకొల్పుకునేందుకు ఈ నగదును సద్వినియోగం చేసుకోవాలి.

– జి.సురేష్‌కుమార్, ఏపీఎం, వైఎస్సార్ క్రాంతి పథం, ప్రత్తిపాడు

ఆర్థికాభివృద్ధి జగనన్నతోనే సాధ్యం

- వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్
- సొపాడులో 'గుండె గుండెకు జగనన్న– గడప గడపకు కిరణన్న'



మహిళకు సంక్షేమ పథకాల కరపత్రం అందజేస్తున్న బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: ప్రతి కుటుంబాన్ని ఆర్థికంగా అభివృద్ధి చేయటంతోపాటు రాష్ట్రాభివృద్ధి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు సమన్వయకర్త బలసాని కిరణ్ కుమార్ అన్నారు. సోమవారం వట్టిచెరుకూరు మండలం సొపాడు గ్రామంలో గుండె గుండెకు జగనన్న.. గడప గడపకు కిరణన్న కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న సమన్వయకర్త కిరణ్‌కుమార్ ఇంటింటికీ తిరుగుతూ ప్రజలతో మాట్లాడారు. వైఎస్సార్ ఆసరా నిధులను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి బటన్ నొక్కి విడుదల చేశారని తెలిపారు. ఆడబిడ్డల మోములో చిరునవ్వులు చూసేందుకు మీ తోడుగా జగనన్న ఉన్నారన్నారు. 2014 సంవత్సరానికి ముందు చంద్రబాబు నాయుడు డ్వాక్రా మహిళలకు రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చి నిండా ముంచారని, ఆ సమయంలో బ్యాంకులకు వడ్డీలు కట్టలేక డీఫాల్టర్లుగా మారారని గుర్తు చేశారు. నేడు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాటకు కట్టుబడి బ్యాంకులో రుణాలన్నీ మాఫీ చేస్తున్నారని గుర్తు చేశారు. దీంతో బ్యాంకుల్లో డ్వాక్రా మహిళల పరపతి పెరిగిందని అన్నారు. పార్టీలు, కులాలు, మతాలు చూడకుండా ప్రజల ఖాతాల్లో నేరుగా నగదు జమ చేస్తున్నారని తెలిపారు. సామాన్యుడిగా మీ ముందుకొచ్చానని, ఆశీర్వదించాలని కోరారు. అదేవిధంగా ప్రతి బీసీ, ఎస్సీ, ఎస్టీ, ముస్లిం మైనారిటీ, అగ్రవర్ణాల పేదలకు సైతం సంక్షేమ పథకాలను ఇంటివద్దకే అందించిన మహా నాయకుడు మన జగనన్న అని తెలిపారు. జెడ్పీటీసీ సభ్యులు, ఎంపీపీలు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, కార్పొరేటర్లు, వివిధ సొసైటీల చైర్మన్‌లు, డైరెక్టర్‌లు, వివిధ కార్పొరేషన్‌ల చైర్మన్లు, డైరెక్టర్‌లు, పార్టీ అనుబంధ విభాగాల నాయకులు, డివిజన్ల కన్వీనర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, అభిమానులు పాల్గొన్నారు.

నాణ్యతా ప్రమాణాలతో జగనన్న గోరుముద్ద

హెచ్‌ఎంల సమావేశంలో ఎంఈఓ సీహెచ్ రమాదేవి



హెచ్‌ఎంల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ రమాదేవి, పక్కన ఎంఈఓ-2 లీలారాణి

ప్రత్తిపాడు: నాణ్యతా ప్రమాణాలతో జగనన్న గోరుముద్ద పథకాన్ని అమలు చేయాలని, ఇందులో ఎలాంటి రాజీ ధోరణి అవలంభించవద్దని ఎంఈఓ సీహెచ్ రమాదేవి అన్నారు. నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులోని భవనం వెంకటరెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ప్రధానోపాధ్యాయులతో సమావేశాన్ని నిర్వహించారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థుల అటెండెన్స్ యాప్‌లో పది గంటల్లోపు విద్యార్థుల హాజరు నమోదు చేయాలన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయులు తొమ్మిది గంటల లోపు హాజరు నమోదు ప్రక్రియను పూర్తి చేయాలన్నారు. నోట్‌బుక్స్, లెస్సన్ ప్లాన్, డైలీ ప్లాన్‌ను కచ్చితంగా నిర్ణీత షెడ్యూల్ ప్రకారం పూర్తి చేయాలని హెచ్‌ఎంలను ఆదేశించారు.

పెయిన్ కిల్లర్‌తో పనిలేకుండా..

పెయిన్ కిల్లర్‌తో పనిలేకుండా వ్యాయామంతోనే నొప్పులను నివారించవచ్చని ఫిజియోథెరపిస్ట్ మహేష్‌కుమార్ తెలిపారు. స్థానిక హైస్కూలులో హెచ్‌ఎంలకు ఫిజియోథెరపీపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కీళ్ల నొప్పులు, నడుం నొప్పులు, బ్యాక్ పెయిన్, వెన్నునొప్పి, నెక్ పెయిన్.. వంటి సమస్యలను ఫిజియోథెరపీ ద్వారా నియంత్రించవచ్చని వివరించారు. విచ్చలవిడిగా పెయిన్ కిల్లర్‌లను వినియోగించడం ద్వారా దుష్ప్రభావాలుంటాయని చెప్పారు. ఫిజియోథెరపీ ట్రైనర్ డాక్టర్ పి.రమేష్, ఎంఈఓ–2 లీలారాణి, హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

మృతదేహంతో రాస్తారోకో



మృతదేహంతో రాస్తారోకో చేస్తున్న బంధువులు

చేబ్రోలు: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన యువకుడి కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ చేబ్రోలు పోలీసుస్టేషన్ ముందు మృతదేహాన్ని పెట్టి రాస్తారోకో చేసిన సంఘటన సోమవారం జరిగింది. బాపట్ల జిల్లా చుండూరు మండలం మోదుకూరు గ్రామానికి చెందిన చల్లపల్లి విజయ్ ఆదివారం మండల కేంద్రమైన చేబ్రోలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎదురుగా జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. యువకుడి మరణానికి లారీ, కారు డ్రైవర్ నిర్లక్ష్యమే కారణమంటూ బంధువులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గుంటూరు ప్రభుత్వ వైద్యశాలలో విజయ్ మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం స్వగ్రామం మోదుకూరు తీసుకువెళ్తూ చేబ్రోలు పోలీసుస్టేషన్ ముందు మృతదేహం ఉంచి రాస్తారోకో చేశారు. పోలీసు స్టేషన్ ఎదురుగా జీబీసీ రహదారిపై యువకుడి మృతదేహంతో కుటుంబసభ్యులు, బంధువులు, దళిత సంఘాల నాయకులు బైఠాయించారు. ప్రమాదానికి కారణమైన వారిని కఠినంగా శిక్షించాలని, విజయ్ కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ నినాదాలు చేశారు. తెనాలి డీఎస్పీ జనార్ధనరావు, పొన్నూరు రూరల్, పట్టణ సీఐలు కోటేశ్వరరావు, భాస్కరరావు, చేబ్రోలు ఎస్ఐ గిరిబాబు, స్థానిక తహసీల్దార్ కేవీ గోపాలకృష్ణ తదితరులు నిరసన వ్యక్తం చేస్తున్న వారితో సంప్రదింపులు చేయడంతో, నష్టపరిహారం ఇవ్వటానికి అంగీకరించారు. సుమారు రెండు గంటలపాటు రాస్తారోకో జరగడంతో పొన్నూరు, గుంటూరు వైపున పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. దీంతో ప్రయాణికులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. చివరకు మృతదేహాన్ని అక్కడ నుంచి తరలించటంతో పోలీసులు, అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.

ఆస్పత్రికి వెళ్లి పెన్షన్ అందజేత



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పెద్దబ్బాయికి పెన్షన్ అందజేస్తున్న వలంటీరు

తిక్కిరెడ్డిపాలెం (ప్రత్తిపాడు): అనారోగ్యంతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న రోగికి పెన్షన్ అందజేసి ఔదార్యాన్ని చాటారు ఓ వలంటీరు. ప్రత్తిపాడు మండలం తిక్కిరెడ్డిపాలెం గ్రామానికి చెందిన బొడ్డు పెద్దబ్బాయి గత కొంతకాలంగా బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతూ గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ నేపథ్యంలో సోమవారం గ్రామ వలంటీరు జొన్నలగడ్డ కోటీశ్వరమ్మ గుంటూరులోని ఆస్పత్రికి వెళ్లి పెన్షన్ అందజేసింది. పెద్దబ్బాయి నుంచి వేలిముద్రలు తీసుకుని వృద్ధాప్య పింఛను రూ.3వేలు అందించడంతో అతని ఆనందానికి అవధుల్లేకుండా పోయింది.

విజయవాడ వెళ్లి..

పొన్నూరు: పట్టణంలోని సాంబశివనగర్ సచివాలయానికి చెందిన ఒంటరి మహిళా పింఛన్‌దారు గోడ మేరీ అనారోగ్యంతో విజయవాడలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతోంది. దీంతో వలంటీర్ తోట లావణ్య సోమవారం విజయవాడలోని ఆసుపత్రికి వెళ్లి ఆమె పింఛను రూ.3 వేలు అందించారు. వలంటీర్ సేవలను సచివాలయ సిబ్బందితోపాటు పలువురు అభినందించారు.

ఆర్‌వీఆర్‌జేసీలో రాష్ట్రస్థాయి టెక్నికల్ పోటీలు



జ్యోతి ప్రజ్వలన చేసి టెక్నికల్ పోటీలను ప్రారంభిస్తున్న దృశ్యం

గుంటూరు రూరల్: టెక్నాలజీ రంగంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా నూతన ఆవిష్కరణలు చేస్తూ, అందులో ఎదురయ్యే సమస్యల పరిష్కార సవాళ్లను అధిగమించేందుకు విద్యార్థులు సిద్ధంగా ఉండాలని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్ తెలిపారు. సోమవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో రాష్ట్రస్థాయి టెక్నికల్ పోటీలు టెక్నిజెన్ పేరుతో ప్రారంభించారు. రెండురోజుల పాటు నిర్వహించే ఈ పోటీలలో మొదటిరోజు ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాంకేతిక నైపుణ్యతను అందిపుచ్చుకుని లక్ష్యసాధన దిశగా కృషిచేయాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్ మాట్లాడుతూ ఇటువంటి పోటీల్లో పాల్గొనడం ద్వారా విద్యార్థుల్లోని విజ్ఞానాన్ని మెరుగుపరుచుకోవచ్చన్నారు. సాంకేతిక నైపుణ్యాలు మెరుగు పరుచుకోవటం ద్వారా ఉద్యోగ అవకాశాల ప్రవేశానికి దోహదపడతాయని కళాశాల సెక్రటరీ కరెస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రెజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్‌లు తెలిపారు. రాష్ట్రస్థాయిలో నిర్వహిస్తున్న ఈ టెక్నికల్ పోటీల్లో వివిధ కళాశాలల నుంచి 1,500 మందికి పైగా విద్యార్థులు పాల్గొన్నారని, తొలిరోజు జరిగే 'సి జావా', 'పైథాన్' విభాగాల్లో విద్యార్థులు తమ ప్రతిభను నిరూపించుకునేందుకు ఉత్సుకత చూపడం ఆనందకరమన్నారు. కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాసరావు, డాక్టర్ శ్రీలత, డాక్టర్ నగేష్, తదితరులు పాల్గొన్నారు.

జగన్ బాబు.. మా బతుకులు మార్చాడయ్యా..

- ఎస్టీల ఆత్మీయ సభలో మహిళలు
- మా కష్టాలు వినే బలసానికే మా మద్దతు



సమావేశంలో మాట్లాడుతున్న సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్

గుంటూరు రూరల్: ''అయ్యా.. పూరి గుడిసెల్లో బతికేటోళ్లం.. కాగితాలు ఏరుకుని బతికేటోళ్లం.. ఐదేళ్ల క్రితం కనీసం బియ్యం కార్డు కూడా లేదు. ఎవరో వలంటీర్ అని వచ్చారు. ఏవేవో రాసుకుని వెళ్లారు.. అంతేనయ్యా.. కొద్ది రోజులకే మాకు రేషన్ కార్డిచ్చారు.. పతి నెలా ఇంటికాడకొచ్చి బియ్యమిత్తన్నారు. ఇప్పుడు ఇంటి పట్టా ఇచ్చి.. ఇల్లు కూడా కట్టిత్తనారయ్యా.. సీఎం జగన్ బాబు చల్లగుండాల.. అయితే కాలనీలో అక్కడక్కడా కొన్ని పనులు సేయలేదయ్యా.. ఇదిగో ఇన్నాళ్లకు మళ్లీ మీరే మమ్మల్ని పిలిచి మరీ మా కట్టాలు తీరుత్తామని సెబుతుంటే ఆనందంగా ఉందయ్యా.. మిమ్మల్ని గెలిపించే బాధ్యత మాదయ్యా..'' అంటూ ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన మహిళలు వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ వద్ద భావోద్వేగానికి గురయ్యారు. సోమవారం రూరల్ మండలం ఏటుకూరులోని వైఎస్సార్ సీపీ నియోజకవర్గం కార్యాలయంలో యండేటి వెంకటసుబ్బయ్య ఆధ్వర్యంలో ఎస్టీల ఆత్మీయ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా సమన్వయకర్త బలసాని మాట్లాడుతూ ఊరికి దూరంగా చాలీచాలని సంపాదనతో బతుకీడుస్తున్న ఎస్టీల ఆత్మ గౌరవాన్ని ఆర్థిక ఆసరాతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముందుకు నడుపుతున్నారని తెలిపారు. కనీసం కూడు, గూడు లేని ఎస్టీలను పట్టించుకోవడంలో గత ప్రభుత్వాలు నిర్లక్ష్యం ప్రదర్శించాయన్నారు. గత ప్రభుత్వాల తప్పువల్లే వారి జీవితాలు మారలేదని చెప్పారు. నేడు జగనన్న ప్రభుత్వంలో ఎస్టీ కాలనీల్లో పిల్లలు టై, బెల్టు, షూస్ వేసుకుని బ్యాగ్ తగిలించుకుని పాఠశాలలకు వెళుతుంటే అంబేడ్కర్ కలలుగన్న మార్పు కళ్ల ముందు కదలాడుతోందన్నారు. మన బిడ్డలు విద్యావంతులైతేనే అంతరాల గోడలు బద్దలవుతాయని, ఇది సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డితోనే సాధ్యమని చెప్పారు. అమ్మ ఒడి పథకం ద్వారా పిల్లలను బడికి పంపిస్తూ.. ఆ పాఠశాలలను నాడు–నేడు పథకం ద్వారా రూపురేఖలు మార్చి.. విద్యాకానుకతో బిడ్డలకు బంగారు భవిష్యత్ అందిస్తున్న సీఎం వైఎస్ జగన్ లాంటి నాయకునికి మనందరం మద్దతిద్దామని పిలుపునిచ్చారు. అనంతరం స్థానికులు చెప్పిన సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, 500 మందికిపైగా ఎస్టీ కుటుంబాలు పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అబాకస్‌లో ప్రెసిడెన్సీ విద్యార్థుల ప్రతిభ

చేబ్రోలు: చేబ్రోలు ప్రెసిడెన్సీ హైస్కూల్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు జిల్లాస్థాయి అబాకస్ పోటీల్లో ప్రతిభ కనబరిచి బహుమతులు సాధించినట్లు డైరక్టర్ వాసిరెడ్డి బస్‌బాబు సోమవారం తెలిపారు. గుంటూరు సెంట్రల్ పబ్లిక్ స్కూల్‌లో నిర్వహించిన అబాకస్ జిల్లా స్థాయి పోటీలలో జూనియర్స్ విభాగంలో ఐ.బాల భవ్యశ్రీ ప్రథమ బహుమతి, స్టార్ జూనియర్స్ విభాగంలో కె.కిషన్ వెంకట శివసాయి ద్వితీయ బహుమతి సాధించినట్లు తెలిపారు. ప్రతిభ కనబరిచి బహుమతుల సాధించిన విద్యార్థులను ప్రిన్సిపాల్ వి.ఆశాలత, ఉపాధ్యాయులు అభినందించారు.

మహా శివరాత్రి ఏర్పాట్లపై పాలకమండలి సమావేశం



పెదకాకాని: శివాలయంలో మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు ప్రత్యేక ఏర్పాట్లు చేయడం జరుగుతుందని ధర్మకర్తల మండలి చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు అన్నారు. పెదకాకాని శ్రీ భ్రమరాంబ మల్లేశ్వరస్వామి దేవస్థానంలో సోమవారం ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మహాశివరాత్రి పర్వదినంలో భక్తులకు క్యూలైన్లు, వసతులు, స్వామివారి కల్యాణం, రథోత్సవం, తెప్పోత్సవం, అన్నప్రసాద వితరణ, భక్తులకు అసౌకర్యం కలుగకుండా ఏర్పాట్లపై చర్చించి తీర్మానం చేశామన్నారు. 2024 జనవరి నెల ఆలయ జమా ఖర్చులకు ఆమోదం తెలిపినట్లు ఆలయ సహాయ కమిషనర్ నల్లకాల్వ శ్రీనివాసరెడ్డి తెలిపారు. చైర్మన్ అమ్మిశెట్టి శివశంకరరావు, ధర్మకర్తల మండలి సభ్యులు పాల్గొన్నారు.

ప్రచార రథాలు ప్రారంభం

పొన్నూరు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య ఆధ్వర్యంలో పొన్నూరు నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించేందుకు ఏర్పాటైన ప్రచార రథాలను పార్టీ పట్టణ, మండలాధ్యక్షులు ఎంఏ మహమూద్, రుద్రపాటి ఆదిశేషులు సోమవారం ప్రారంభించారు. పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్న వైఎస్సార్ సీపీ లక్ష్యాలను ప్రచార రథాల ద్వారా ప్రజలకు తెలియజేయనున్నట్లు నాయకులు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ ఆకుల వెంకటేశ్వరావు, మునిపల్లె పీఏసీఎస్ చైర్మన్ కోట శ్రీనివాస రావు, గుంటూరు జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు పెరికల కృష్ణమోహన్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.